క్లుప్తంగా

విద్యార్థులతో వర్క్‌బుక్‌లో రాయించాలి



విద్యార్థులతో చదివిపిస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: విద్యార్థులతో వర్క్‌బుక్‌ల్లో రాయించాలని, రాసిన బుక్‌లను సరి చూడాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని ధనోరా తెలుగు మీడియం పాఠశాలను శనివారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్లం చదివించారు. బోర్డుపై అక్షరాలు రాయించారు. విద్యార్థులకు చదవడం, రాయడం రావాలని సూచించారు. ప్రతీరోజు ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరు వేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు శైలజ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో తులసీ కల్యాణం



పూజలో పాల్గొన్న భక్తులు

లింగాపూర్: మండల కేంద్రంలోని ఆయా వాడల్లో శనివారం భక్తిశ్రద్ధలతో తులసీ కల్యాణం నిర్వహించారు. మట్టితో తయారు చేసిన శివుడు, గంగా ప్రతిమలకు పూజలు చేశారు. అనంతరం ఉసిరి, కృష్ణుడి ప్రతిమలకు వివాహం చేశారు. మహాశివరాత్రి వరకు వివిధ రకాల పూజలు కొనసాగనున్నట్లు భక్తులు తెలిపారు.

వృథాగా 'భగీరథ' నీరు



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ నీరు వృథాగా పోతుంది. పట్టణంలోని ప్రధాన కాలనీల్లో మిషన్ భగీరథ నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, ప్రధాన రహదారిపై భగీరథ పైపునకు మూత బిగించకపోవడంతో నీరు వృథాగా పోతుండడం గమనార్హం. గత కొన్ని నెలలుగా నీరంతా వృథాగా పోతున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కాసిపేట: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో శనివారం ఎంపీడీవో ఎంఏ అలీం 22 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. లంబాడితండా(కె), పాత వరిపేట, పల్లంగూడ, కోమటిచేను, కొండపూర్, కోనూర్, ధర్మరావుపేట, వెంకటపూర్, సోనాపూర్, గట్రావుపల్లి, దేవాపూర్‌లోని మొత్తం పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. దేవాపూర్‌లో పోలింగ్ కేంద్రాల్లో గ్రామపంచాయతీ సిబ్బందితో చెత్తచెదారం, పిచ్చిమొక్కలు తొలగింపజేసి శుభ్రం చేయించారు. ఈ నెల 28న పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన పాఠశాలలు, కార్యాలయాలకు సంబంధించి తాళాలు తీసుకొని ఫర్నీచర్ సమకూర్చుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో టెంట్, వాటర్ ఏర్పాటు చేయడంతో పాటు ఎన్నికల సిబ్బందికి టిఫిన్, లంచ్ ఏర్పాట్లు చేయించాల్సిందిగా సూచించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో నాగరాజు, దేవాపూర్ పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులున్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గల శ్రీదాసాంజనేయ స్వామి ఆలయంలో శనివారం కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తీకదీపం వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి చిల్కూరి సుభాశ్ రెడ్డి, కోరెడ్డి, లెనిన్, సభ్యులు వేణుగోపాల్, పండరీ, కిషోర్ సింగ్, భారత్, శ్రీహరి, శివ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

నేరడిగొండ: ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేలా ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్సై సాయన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర బలగాలు, నేరడిగొండ పోలీసులు పాల్గొన్నారు.

రైతును రాజు చేసే ప్రభుత్వం రావాలి

కెరమెరి: రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేసే ప్రభుత్వానికే తమ మద్దతు ఉంటుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి' రైతులను కదిలించగా తమ అభిప్రాయాలు తెలియజేశారు.

జంగ్ తెలంగాణ

రైతులకు మేలు చేయాలి



ఇన్నాళ్లుగా ఎందరో నాయకులు వచ్చారు. కానీ రైతులకు న్యాయం జరగడం లేదు. ఈసారి రైతులకు మేలు చేసే నాయకులు రావాలి. అలాంటి వారికే మద్దతిస్తాను.

\- సెందే సకారాం, బారేమోడి

మద్దతు ధర కల్పించాలి



రైతులకు మద్దతు ధర కల్పించే పార్టీకే ఓటు వేస్తా. ఎన్నికల హామీలను నెరవేర్చే నాయకుడు కావాలి. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పే వారిని తరిమికొట్టాలి.

\- వి.బాజీరావు, అంతాపూర్

కష్టసుఖాల్లో ఆదుకోవాలి



రైతులంటే దేశానికి బువ్వ పెట్టే అన్నదాతగా గుర్తించే నాయకుడు కావాలి. రైతుల సమస్యలను తన సమస్యగా భావించి పరిష్కరించాలి. రైతుల కష్టసుఖాలు తెలిసిన నాయకుడికే ఈ ఎన్నికల్లో పూర్తి మద్దతు ఇస్తాను.

\- దండేరావు, చౌపన్‌గూడ

సమస్యలపై పోరాడాలి



రైతుల సమస్యలపై ప్రభుత్వంతో పోరాడాలి. ఎలాంటి సందర్భాల్లోనైనా అన్నదాత తరఫున మాట్లాడాలి. నిత్యం రైతుల పక్షాన నిలబడాలి. రైతుల కోసం పోరాడే నాయకుడికే మద్దతిస్తా.

\- రాథోడ్ రవినాయక్, లక్మాపూర్

ప్రారంభం కాని 'కేంద్రాలు'

- ఆకాశంలో మబ్బులతో రైతుల ఆందోళన
- ప్రభుత్వానికి అమ్మితే తాలు పేరిట కోతలు
- ప్రైవేటుకు అమ్మడమే మేలంటున్న రైతులు



దహెగాంలో ఆరబెట్టిన ధాన్యం

దహెగాం: వరి కోతలు పూర్తయ్యి ధాన్యాన్ని ఆరబెట్టినా మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. ఆకాశంలో మబ్బుల కారణంగా రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభంలో జాప్యం కావడంతో పాటు కొనుగోలుకేంద్రాల్లో తప్పా, తాలు పేరిట కోతలు విధిస్తుండడంతో రైతులు ధాన్యాన్ని ప్రైవేటు వారికి విక్రయిస్తున్నారు. ప్రభుత్వానికి విక్రయిస్తే మిల్లర్లు క్వింటాలుకు ఆరు నుంచి పది కిలోల వరకు కోతలు విధిస్తారని ప్రైవేట్ వారికే విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రైవేట్ వ్యక్తులు తప్పా, తాలు ఉన్నా క్వింటాలుకు రూ.1900 నుంచి రూ. 2,000 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

9,400 ఎకరాల్లో వరి సాగు..

ఈ ఖరీఫ్‌లో మండల వ్యాప్తంగా రైతులు 9,400 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఆశించిన స్థాయిలో వర్షాలు పడక పోవడంతో వరినాట్లు కాస్త ఆలస్యమయ్యాయి. బోర్ల సౌకర్యం ఉన్నవారు ముందుగానే నాట్లు వేసుకున్నారు. ముందుగా నాట్లు వేసుకున్న రైతుల వరి పొలం గత 20 రోజుల క్రితమే కోతకు రాగా సుమారు 50శాతం కోతలు పూర్తయ్యాయి. ధాన్యాన్ని కల్లాల్లో, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టారు. కొనుగోలు కేంద్రాలను మొదటి వారంలోనే ప్రారంభించాల్సి ఉండగా నేటికీ ప్రారంభించలేదు. కొందరు రైతులు ధాన్యాన్ని ఇంకా ఎన్ని రోజులు ఆరబెట్టాలని ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు.

6 నుంచి 10 కిలోల కోత..

గత సంవత్సరం ధాన్యం పండించిన రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడంతో తీవ్రంగా నష్టపోయారు. మిల్లర్లు క్వింటాలుకు 6 నుంచి 10 కిలోల వరకు కోత విధిస్తున్నారని రైతులు ధర్నాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. దీంతో తప్పా, తాలు పేరిట కోత పడడం.. సకాలంలో కొనుగోళ్లు జరపకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యక్తులకే విక్రయించడం మేలని పేర్కొంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ. 2,203గా ఉంది. ధాన్యంలో తేమ శాతం 17కు మించకూడదనే నిబంధనలు ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో సొసైటీలకు ధాన్యం విక్రయిస్తే డబ్బులు త్వరగా రావేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇది వరకే ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రోజు వారీగా ఒక టార్పాలిన్‌కు రూ.20 నుంచి రూ.30 చెల్లిస్తున్నారు. దీంతో అదనంగా టార్పాలిన్ల ఖర్చు ఒక్కో రైతుకు రూ. 2వేల నుంచి రూ. 4వేల వరకు ఖర్చు వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ప్రైవేటుకు విక్రయించినా నష్టమేం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



వరి కోతలు పూర్తయ్యి 20 రోజులు అయింది. కొనుగోలు కేంద్రాలు ఇంతవరకు ప్రారంభం కాలేదు. రోజూ టార్పాలిన్లు అద్దెకు తీసుకొచ్చి ధాన్యం ఆరబెడుతున్నా. కొంత మంది రైతులు ప్రైవేటు వాళ్లకు అమ్ముకున్నారు. అసలే మబ్బులు వస్తున్నాయి. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

\- మోరె సంతోష్, రైతు

ప్రైవేటుకు విక్రయించాం..



గత ఏడాది యాసంగిలో మిల్లర్లు కోత విధించారు. దీంతో ఈ వానాకాలం పంటను సొసైటీకి అమ్మకుండా ప్రైవేటుకు విక్రయించినా. క్వింటాలుకు రూ. 2 వేలు ధర పలికింది. ఎలాంటి కోతలు లేవు. తప్పా, తాలు తూర్పారా పట్టకపోయినా ప్రైవేటు వాళ్లు కొనుగోలు చేస్తున్నారు.

\- నస్పూరి జంపయ్య, రైతు

జోరుగా ఎన్నికల ప్రచారం



నార్నూర్ మండల కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో తీరిక లేకుండా ప్రచారం చేస్తున్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం..

జిల్లాకేంద్రంతో పాటు లింగాపూర్ మండలంలోని ఎల్లాపటార్, వంకామద్ది, పిక్లాతండా, సద్దంగుడా, లింగాపూర్ గ్రామాల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం ప్రచారం చేశారు. నార్నూర్ మండలంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి పాల్గొని ప్రచారం చేశారు.

ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్..

జిల్లాలోని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు.

హోరెత్తిస్తున్న బీజేపీ నాయకుల ప్రచారం..

జిల్లాలో బీజేపీ నాయకులు ప్రచారంలో హోరెత్తిస్తున్నారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు రామ జన్మభూమి, ఆర్టికల్ 370 వంటి అంశాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

సిర్పూర్‌లో నీలి జెండా ఎగరడం ఖాయం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



తలోడిలో ప్రచారంలో పాల్గొన్న ఆర్ఎస్పీ

కౌటాల: సిర్పూర్‌లో నీలి జెండా ఎగరడం ఖాయమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కన్నెపల్లి, యాపలగూడ, తలోడి, సైదాపూర్, విజయనగరం, కోయగూడ, ముత్తంపేట్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఎస్పీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీ జాతీయ కోఆర్డినేటర్, రాజ్యసభ్య సభ్యులు రాంజీ గౌతమ్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు దుర్గం మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులను విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక మాల మహానాడు కార్యాలయ ఆవరణలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రచార కరపత్రాలు విడుదల చేశారు.

మోతుగూడ ఆశ్రమంలో వార్షికోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడ వేదాంత విచారణ ధ్యాన నిష్ఠ ఆశ్రమంలో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో ఉదయం ఆశ్రమ పీఠాధిపతి చిన్మయానందగిరి స్వామిజీ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, సామూహిక భగవద్గీత పారాయణ, పతాకావిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు బ్రహ్మయ్య, దాదాజీ, ఆనంద్‌రావు, మల్లయ్య పాల్గొన్నారు.

అధ్వానంగా ఎడమ కాలువ



పిచ్చి మొక్కలతో కుమురంభీం (అడ) ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ

- పూడికతో నిండిన అడ ప్రాజెక్టు కాలువ
- పేరుకుపోయిన నాచు, పిచ్చి మొక్కలు

వాంకిడి: కుమురంభీం (అడ) ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. కొన్నేళ్లుగా కాలువలో పూడిక తీసిన దాఖలాలు లేవు. దీంతో కాలువ పొడవునా పిచ్చి మొక్కలు పేరుకుపోయి, నాచు తయారై అధ్వానంగా మారింది. 39,000 ఎకరాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టు నుంచి సరాండి, వాంకిడి, చిన్న వాంకిడి మీదుగా 65 కి.మీ పొడవునా నిర్మించిన ఎడమ కాలువకు పలుచోట్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదు. కాలువలో పూడిక, నాచు అతిగా పేరుకుపోయి ఉన్నందునా అటుగా వెళ్లే వారు దుర్గంధ వాసన భరించలేక పోతున్నామని వాపోతున్నారు. అధికారులు దృష్టి సారించి కాలువలోని చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

అదుపు తప్పితే ప్రాణాలకే ముప్పు..

సరాండి గ్రామం నుంచి ఇందాని గ్రామం వరకు ఎడమ కాలువ గట్టు మీదుగానే బీటీ రహదారి ఉంది. ఈ రహదారి గుండా పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. కాలువలో నీటి ప్రవాహం తక్కువగా ఉన్నప్పటికీ పూడిక, నాచు భారీగా పేరుకుపోయి ఉంది. దీంతో ప్రమాదవశాత్తు అదుపు తప్పి కాలువలో పడితే ఒడ్డుకు చేరుకోలేని పరిస్థితి ఉంది. గత ఎండాకాలంలో లెండిగూడ గ్రామానికి చెందిన దంపతులు తెల్లవారుజామున గుడికి వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి కాలువలో పడిపోయారు. ఈ ప్రమాదంలో భర్త బయటపడగా, భార్య మృతి చెందింది. సరాండి గ్రామానికి చెందిన 10వ తరగతి బాలిక ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందింది. ఏడాది క్రితం సరాండి గ్రామానికి చెందిన ఓ యువకుడు తన పొలానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా అదుపుతప్పి కాలువలో పడిపోయాడు. యువకుడికి ఈత రాకపోవడంతో పాటు కాలువలో ఉన్న పూడికలో దిగిపోవడంతో కాలువ ఒడ్డుకు చేరుకోలేక ఇబ్బంది పడ్డాడు. యువకుడి వెంట తన అన్న ఉండటంతో ప్రాణాలు కాపాడుకోగలిగాడు. కాలువలో పూడికతీత, మరమ్మతులపై ప్రాజెక్టు డీఈ దామోదర్‌ను వివరణ కోరగా కొత్తగా వచ్చిన లష్కరులతో కాలువకు ఒకవైపు పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. కాలువ మరమ్మతులకు సరిపడా నిధులు లేకపోవడంతోనే పనులు చేపట్టలేకపోతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే మరమ్మతులతో పాటు కాలువలోని చెత్త తొలగింపు చర్యలు చేపడుతామని తెలిపారు.


పాఠశాలలో మాక్ పోలింగ్



పోలింగ్ చిట్టీలు చూపిస్తున్న విద్యార్థులు



ఓటు వేస్తున్న విద్యార్థి



ఓటరు వివరాలు నమోదు చేస్తున్న విద్యార్థి

కెరమెరి: మండలంలోని ఇందాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులే అభ్యర్థులుగా పోటీ చేయగా వారికి గుర్తులు కేటాయించారు. మిగితా విద్యార్థులు తమకు నచ్చిన అభ్యర్థికి బ్యాలెట్ బాక్సులో ఓటు వేశారు. ప్రధానోపాధ్యాయురాలు రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులు శనివారం క్షేత్ర పర్యటన చేపట్టారు. పిల్లల కోసం కార్యక్రమంలో భాగంగా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం విభాగం విద్యార్థులు మండలంలోని తాళ్లగురిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా బోధన చేశారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం అధికారి రేష్మా మాట్లాడుతూ... విద్యార్థులకు గ్రామాల్లోని పాఠశాలల్లో క్షేత్ర పర్యటన చేయించడం ద్వారా అక్కడి స్థితిగతులను అభ్యసించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు పాఠశాల ఆవరణాన్ని, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు.

నెన్నెలలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

నెన్నెల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు నమ్మకం పెంచేందుకు మండల కేంద్రంలో శనివారం బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ, కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజల్లో పోలీసులు ఉన్నారనే ధైర్యాన్ని నింపేందుకు, భద్రత భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. గ్రామాల్లో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట నెన్నెల, బెల్లంపల్లిటూటౌన్, తాళ్లగురిజాల ఎస్సైలు శ్యాంపటేల్, రమేష్, నరేష్‌లు పాల్గొన్నారు.

పోలింగ్ చిట్టీల పంపిణీ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి పోలింగ్ చిట్టీలు పంపిణీ చేశారు. శనివారం మండలంలోని సుందర్‌నగర్, హీరాపూర్, రమాయినగర్, భగత్‌సింగ్‌నగర్, ఏమాయికుంట గ్రామాల్లో బీఎల్‌వోలు కోవ దేవుబాయి, రాజేశ్వరిలు ఓటర్లకు పోలింగ్ చిటీలు పంపిణీ చేశారు. ఓటుహక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు.

రోడ్డుపై చెట్టు కొమ్మ!



రోడ్డుపై పడిన చెట్టు కొమ్మ

కౌటాల: మండలంలో కురిసిన వర్షానికి, గాలి దుమారానికి కౌటాల- కాగజ్‌నగర్ ప్రధానరహదారిపై చెట్టు కొమ్మ శుక్రవారం రాత్రి విరిగి పడింది. కౌటాల- ముత్తంపేట్ మధ్యలో రోడ్డుపై చెట్టు కొమ్మ విరిగి పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చెట్టు కొమ్మను గమనించకుండా వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి రోడ్డుపై నుంచి చెట్టు కొమ్మను తొలగించాలని కోరుతున్నారు.

అకాల వర్షంతో పంట నష్టం



నేలకొరిగిన వరి పంట

ఆసిఫాబాద్‌రూరల్: అకాల వర్షంతో అన్నదాతకు తీరని నష్టం జరిగింది. రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు మండలంలోని మోతుగూడ, అప్పపల్లి, ఈదులవాడ, కొమ్ముగూడ, బూర్గుడతో పాటు పలు గ్రామాల్లో కోత దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. పత్తి పంట వర్షం కారణంగా నల్లబడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.